# పాడులోకం

క్షమించాలి: కాని ఈ యిద్దరు మనుష్యుల్నీ కలుసుకోవడం, వారి సంభాషణా (క్రిందనే వ్రాయబోతున్నాను అదంతా), ఇవి జరిగిన పరిస్థితులూ – అన్నీ కూడా ఏదో భయంకరమైన న్యూస్ పేపర్ సీరియల్ లాగున్నాయి.

ఓ పెద్ద నగరంలో ఒకరాత్రి ఇదంతా జరిగింది. ఆ నగరం 'ప్యారిస్' అనే అనడానికి వీల్లేదు. కాదని కూడా చెప్పడం కష్టం. ఒక నదిగట్టున ఇది జరిగింది. 'సేన్' నదే అనడానికి వీలులేదు. కాదని కూడా చెప్పలేము. ఏమంటే ఒక నదికీ మరొక నదికీ విశేషం భేదమేముంటుంది? చిమ్మచీకటి అప్పుడు, చంద్రుడు లేడు. ఒంటిగంట అవుతుంది. వీధి దీపాలలో సగం ఆరిపోయాయి. అంచేత నదిలో పడవలున్నాయో లేదో తెలియదు. కాని అంత అంధకారంలో కూడా, చలికాలపు వానతో ఉప్పొంగి, నల్లని నీళ్ళతో ప్రవహిస్తున్న ఆ నది చావు బ్రతుకుల విభేదాన్ని తుడిచివెయ్యడానికి సమర్థంగా ఉన్నది. ఉరవడితో ప్రవహిస్తున్న నీళ్ళు ఆత్మహత్య చేసుకోదలచుకున్నవాళ్ళను సులువుగా యమలోకానికి తీసుకుపోతామని ఆహ్వానిస్తున్నాయి.

నిజానికి జనసమ్మర్దంతో కిక్కిరిసిన ఆ నగరంలో ఏడాది మొత్తంమీద చనిపోయే అయిదేసి వందలమందిలో నూరుగురు ఆ నదినే తమ పరలోక ప్రయాణానికి మార్గంగా ఎన్నుకున్నారు.

చవకగా చనిపోవాలనుకున్న మనుష్యులంతా ఈ నదిని ఎన్నుకోవడం స్వాభావికమే. కాని ఇతరులు కూడా ఇందులోనే పడుతున్నారు. ఏమంటే వార్తా పత్రికలన్నీ నీటిలోపడి చావడానికి మంచి ప్రాముఖ్యం ఇచ్చాయి. ఆ సంఘటనలన్నింటినీ వన్నెచిన్నెలతో వర్ణిస్తూ అట్టి మరణాలలో ఆకర్షణ హెచ్చించాయి. వీటిని చదువుతూ ఇలాగే చచ్చిపోవాలని కోరుకుంటారు. ఇక నదిలో పడిపోదలచుకున్న వాళ్ళందరికీ తూర్పుకొస బాగా నచ్చినట్లు కనబడుతుంది. ఈ స్థలం ఏకాంతంగా ఉంటుంది. ఇటు నగరం ఇంకా బాగా పెరగలేదు. మళ్ళీ ఇక్కడ ఎడమగట్టు వాళ్ళకి ఇష్టం. చనిపోయేవాళ్ళకు కూడా పద్ధతులూ, పూర్వాచారాలూ ఉన్నట్టు తోస్తుంది.

సరే, ఆ చీకటి రేయి ఒక మనిషి ఊరికొసను నదికి ఎడమగట్టున తిరుగుతున్నాడు.

అంత వృద్ధుడూ అంత యువకుడూ కాకుండా, అంత పొడుగుగా అంత పొట్టిగా లేకుండా, అంత తెలివీ అంత మూర్ఖత్వం లేని సామాన్యుడు. అందరూ అతణ్ణి (ముఖ్యంగా పోలీసు వాళ్ళు) ట్రిస్టాన్ మార్టినేజ్ అని ఎరుగుదురు.

నది ఒడ్డున పర్యటనం చేస్తున్న ఈ విషాదజీవి జేబులో కొన్ని దస్తావేజు కట్టలున్నాయి. వాటిలో కొన్ని ట్రిస్టాన్ మార్టినెజ్ పేరిటా, మరికొన్ని ట్రిస్టానో మార్టినీ అనీ ఉన్నాయి. ఇవన్నీ అప్పుపత్రాలు. వీటితోబాటు మరో కాగితం కూడా ఉన్నది. అది ముఖ్య రక్షకభటాధికారి దివ్య సముఖానికి ఇతడు రాసిన ఉత్తరం. అందులో కేవలం ఈ మాటలు ఉన్నాయి :

"సంఘానికీ, నా అప్పులవాళ్ళకీ నాకు వీలయిన ఈ ఒక్క మార్గంగా రుణం తీర్చుకుంటున్నాను.

(సం) ట్రిస్టాన్ మార్టినెజ్

(ట్రిస్టానో మార్టినీ అనే వాని మారుపేరు. తండ్రి.... ఫలానా ఫలానా)"

ఐనా ఈ ఉత్తరం జేబులో వేసుకుని తిరుగుతున్న మనిషి దుక్కలాగున్నాడు. హాయిగా జీవితం గడుపుతున్నాడు. హాయిగా జీవితాన్ని గడపడానికే తనకున్న కొద్దిపాటి తెలివినీ, జిత్తులనూ ఉపయోగించాడు. వీలయినన్ని విధాలుగా జీవితం నుండి సుఖాలను పిండుకున్నాడు. ఇప్పటికీ సాధ్యమైనంత దీర్ఘకాలం తన ప్రాణాన్ని తన శరీరంలోనే ఉంచుకుందామని ఉద్దేశం. అయితే అందుకు తన పేరు మాత్రం ఇబ్బంది కలిగిస్తోంది. కొంచెం జాగ్రత్తగా వ్యవహరించగలిగితే రెండు పేర్లనూ వదలగొట్టుకొని మరేమీ ప్రమాదం లేకుండా తప్పించుకోవచ్చును.

అందువల్ల గతించిన రెండు వారాలుగా ప్రతిరాత్రీ ఈ నది ఒడ్డున తిరుగుతున్నాడతడు. ఆత్మహత్య చేసుకుందామని కాదు. 'ఆత్మహత్య చేసుకునేవాడెవడైనా దొరుకుతాడా' అని.

మొదట అతని ఆలోచన మరోవిధంగా పోయింది. సాంకేతికమైన ఆత్మహత్య చేద్దామని చూశాడు. అంటే ఏదో తన పాతకోటూ, హేటూ ఒడ్డున వదలిపెడితే చాలనుకున్నాడు. ఆ కోటు జేబులో పత్రాలన్నిటినీ వదలిపెట్టడం, రైలెక్కి చాలాదూరం దాటిపోవటం. కానీ చిక్కేమిటంటే పోలీసులూ, అప్పులవాళ్ళూ కేవలం ఒక పాతకోటులో దొరికిన 'నేను చచ్చిపోయాను' అనే వాక్యంతో తృప్తిపడతారా అని! తన శవం కనబడాలి. అప్పుడు అన్ని అప్పులూ తీరాలి. కానీ బ్రతికి ఉంటూనే 'నేను శవాన్ని' అని స్థాపించుకోవడానికి ప్రస్తుత నిరంకుశ ప్రభుత్వం అంగీకరించదు.

తర్వాత అతనికి తట్టిన భావం అమోఘమైనది. తనకోటు తొడుక్కున్న శవం

నీళ్ళలో దొరికితే అప్పువాళ్ళ పీడ వదులుతుంది. అయితే దీనికోసం ఒక హత్య చెయ్యాలా తాను? ఎంతమాత్రం కాదు. ట్రిస్టాన్ మార్టినెజ్ అన్న పేరుతోనూ, ట్రిస్టానో మార్టినీ అన్న పేరుతోనూ తాను చాలామార్లు శిక్ష పొందాడు. కానీ ఎవ్వడూ ఈ రెండుపేర్లూ ఉన్న వ్యక్తి, మరొక మనిషి మీద చెయ్యి వేశాడని చెప్పలేడు. తన వ్యవహారమంతా ధన సంగ్రహానికి సంబంధించినది; మనుష్యులనుండీ, పెట్టెలనుండీ, కేవలం న్యాయంగానే సంగ్రహించే వాడని చెప్పడానికి వీలులేదు. దాన్నే తాను ప్రోత్సాహం అంటాడు. ఇతరులు మోసం అంటారు.

ప్రస్తుతం ప్రోత్సాహం మీద తాను ఆధారపడ్డాడు. ఎలాగంటే - ఆత్మహత్య చేసుకుందామని ఇదివరకే నిశ్చయించుకున్న వాడూ, తనతో ఇంచుమించు సరిపోయే ఒడ్డుపొడుగులు గలవాడూ ఎవడైనా ఒకవ్యక్తి దొరికితే వాడికోటును జ్ఞాపకార్థం వదలవయ్యా అని కోరి తన కాగితాలను పంట్లాం జేబులో ఉంచుకొని చచ్చిపొమ్మని ప్రోత్సాహం చెయ్యలేకపోతానా అనుకున్నాడు. ఆత్మహత్య చేసుకునేవాడు ఇలాంటి విషయాలలో అట్టే పట్టింపులు పెట్టుకోడనే నిశ్చయం. ఇక ఒడ్డున తన కోటు దొరికి, నీటిలో కుళ్ళుతున్న శవం దొరికిందంటే తాను బతికిపోయినట్టే! ఇన్నాళ్ళూ ఇబ్బంది పెట్టిన తన పేర్లు నీటిలో కలిసిపోతాయి. తర్వాత మరో కొత్త పేరూ, కొత్త జీవితం. ఇంకే ఉపాయం లేకపోతే కొత్త ఉద్యోగం చూసుకోవచ్చు.

అంతవరకూ పాపం ట్రిస్టానోకు అదృష్టం కలిసిరాలేదు. ఈ రెండు వారాల నుండి తన కిక్కడ కనబడ్డది ఒక్క మనిషి మాత్రమే. అదైనా ఒక పండు ముసలిది. ఆత్మహత్య కోసం కూడా కాదు. చాలా చిక్కులలో ఉన్నాననీ అయిదు 'లైరులు' మాత్రం ఇప్పించమనీ తన్ను కోరింది. అంతే తర్వాత ఒక యువకుడు అటు వచ్చాడు. నల్లటి దుస్తులతో ఆత్మహత్య చేసుకునే రకంలాగే కనబడ్డాడు. తీరా అతణ్ని సమీపించి తన కోరిక తెలియజేసేసరికి వాడు ఉగ్రుడై 'నిన్నే నీళ్ళలో తోస్తాను జాగ్రత్త!' అన్నాడు. క్షమాపణలు చెప్పుకుంటూ ట్రిస్టానో వచ్చేశాడు. బాగా ఆశాభంగమయింది. ఇక యత్నం వదులుకుందామా అనుకున్నాడు. కాని ఇది చాలా అవసరమైనదిగా కూర్చుంది. తాను మరి రెండు రోజుల్లో ఎరస్టు కావడానికి సిద్ధంగా ఉన్నాడుగా!

తుదకు ఆ సాయంకాలం రెండు గంటల నుండీ వేచి వేచి అలసిపోయి ఒక చప్టామీద కూర్చున్న సమయానికి దూరం నుండి రోడ్డు బాగు చెయ్యడానికి వెయ్యబడ్డ కంకరరాళ్ళ పోగుకు వెనుకగా ఒక మనిషి తన వంకనే వస్తూ ఉండటం చూశాడు. ట్రిస్టానో నిపుణ దృష్టికి వస్తున్నవాడు శాంతంగా పోయే మామూలు రకం మనుష్యులలో వాడు కాదని స్పష్టంగా కనబడ్డది. అనుమానపు మనిషికి కావలసిన లక్షణాలన్నీ అతనిలో

ఉన్నవి. ఈ లక్షణాలు వ్యక్తులతో బాటు మారుతూనే ఉంటాయి. కాని తత్వం తెలిసినవాళ్ళకు అవి కరతలామలకం. ఈ వస్తున్నవాడు నేరం చేసే రకం కూడా కాదు. ఆ నడకలో కొంత ఆందోళన కనబడుతున్నది. రాత్రులు నేరాలకు బయలుదేరే వాళ్ళలో చాలా శక్తీ, సాహసం కనబడాలి.

అనుమానపు మనిషి ఇటు వీథిలోనికి మళ్ళాడు. తనదాకా వచ్చాడు. రెండడుగులలో కలుసుకుని దాటిపోయాడు. తన్ను చూసి ఏదో కళవళపాటుతో హేటు కళ్ళమీదికి లాక్కున్నాడు. తొందరగా నడచిపోయాడు.

తన దృష్టినుండి తప్పించుకోకుండా ఉండాలని ట్రిస్టానో అతన్ని వెంబడించాడు. తన్ను ఎవరో వెంబడిస్తున్నట్టు గ్రహించి ఆ మనిషి నడక జోరు చేశాడు. నదిప్రక్క ఎత్తయిన ఒక పిట్టగోడ ఎక్కిపోయాడు. కటకటాల మీద ఒక కాలుపెట్టి ఇక నీళ్ళలోకి దుముకడమే తరవాయిగా ఉన్నట్లు ఉన్నాడు. ట్రిస్టానో ఒక పరుగు పెట్టి అతన్ని అందుకొని, 'ఒక్క క్షణం ఆగండి' అని ఆదుర్దాగా అరిచాడు.

ఆ మనిషికి వేదనపాటి లాఘవం లేకపోయినందున అతని ప్రమాదపు కొంటెతనం పూర్తి అయింది కాదు. అందువల్ల సమయానికి ట్రిస్టానో అతని కోటు చివర అందుకొని లాగడానికి అవకాశం కలిగింది.

అవమానించినట్టు కనబడుతూ నేలకు దిగపోయాడు, వెనక్కి తిరిగి కోపంగా 'వదిలి పెడతావా, లేదా?' అన్నాడు.

"కాని ఒక్క క్షణం వినాలి నా మాట."

"చెబుతున్నాను కాదూ. వదిలేసెయ్ మొదట! ఏమిటి నీ ఉద్దేశ్యం? పోలీసు స్టేషనుకు గానీ నన్ను తీసుకువెళతావా?"

"అబ్బే. ఎంతమాత్రం కాదు."

"అయితే ఆసుపత్రికి కాబోలు. సరే. నాకు శవాల గదిలో కనపడాలని ఉంది!"

మళ్ళీ ఎక్కబోతున్నాడు.. కాని ట్రిస్టానో అతన్ని మళ్ళీ వెనక్కి లాగాడు రెక్క పట్టుకొని, కోటు మీద కొన్ని చిరుగులు కనపడ్డాయి. ఆ దీనుడు చాలా జాలిగా..

"నిన్నేం చేశాను నాయనా? నేను చచ్చిపోవడం చూడలేకపోతే దూరంగా పోకూడదు? నేను... నేను మీరు వెళ్ళిపోయే దాకా కావలిస్తే ఆగుతాను" అన్నాడు.

"మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యడానికి నేనేమీ అభ్యంతరం చెయ్యను, ఒట్టు! మొదట నా మాటలు మాత్రం వినండి."

అతనికి మళ్ళీ కోపం వచ్చింది.

"నిన్నెవరయ్యా పంపించారు? హెడ్డుగారు కదూ?"

"అతనెవరో నాకు తెలియదు."

"అయితే బోధపడింది. మంత్రిగారు పంపించి ఉంటారు. నాకెందుకు తాను ఉద్యోగం ఇయ్యలేదో నచ్చజెప్పాలని... వెళ్ళి అతగాడితో చెప్పు. మళ్ళీ కనపడితే మొగం మీద ఉమ్ముతాననీ."

"కోపగించకండీ! నా అంతట నేనే వచ్చాను. నేనెవరినో చెప్పదలచుకోలేదు. నాకేది కావాలో చెబుతాను."

"ఓహో! నువ్వొక దీన బాంధవుడివన్న మాట. నన్ను రక్షిస్తున్నావు. కాని ఆ సమయం అంతా మించి పోయిందండీ ప్రియమైన దీన బాంధవుడు గారూ! అలాగయితే నా కూతుర్ని కూడా మీరు రక్షించవలసి ఉంటుంది. నాకేమయినా లంచం గానీ యిప్పిస్తారా?... అంతా మాయ వెధవలు?... సరేకాని ఎంత ఇస్తారేమిటి?"

"నేనేమీ తమకు సమర్పించుకోలేను. దురదృష్టవశాత్తూ నన్ను కూడా సంఘం వెలివేసింది. కాని అయినా-"

"నాన్సెన్స్! కబుర్లు. కబుర్లు చాలా విన్నాను. ఈ కబుర్లు ఇక చెప్పకు. నన్ను చనిపోనియ్యకుండా ఎన్ని మాయ మాటలు చెప్పబోతున్నావో అవన్నీ నేనెరిగినవే! నీకు తెలుసునో లేదో, నేను బాగా చదువుకున్న వాణ్ణి. వేదాంతిని కూడా. మన ఆస్తి పోవడం, అదీ, చిక్కులూ ఈ అన్నిటి వల్లా ఏమయితేనేం విద్యామంత్రిగారిని మ్యూజియంలో ఒక ఉద్యోగం ఇప్పించవయ్యా అని కోరాను. వారు సరే, నిరాకరించారు. న్యాయంగా నాకు ప్రొఫెసరు కావడానికి తాహతుంది. ఒక రాజుగారి కొడుక్కి కొన్నాళ్ళు ట్యూటరుగా ఉండమన్నారు. కాని మనం వద్దన్నాము. నేను చచ్చిపోతున్నాననుకున్నావు కాబోలు. లేదు. కేవలం ఈ చచ్చు శరీరం వదిలి పెడుతున్నాను. వీటన్నిటికీ అతీతుణ్ణి నేను, కేటోని నేను."

"మీ ఉన్నతాభిప్రాయాలు ప్రశంసార్హంగా ఉన్నాయి. మళ్ళీ మాట్లాడితే నేను వాటితో ఏకీభవిస్తున్నాను. కాని మీరు చచ్చిపోవడానికి ముందు నేను కోరేదేమంటే –"

"మరికొంత కాలం బతకమని. వల్లకాదు. నా దగ్గర ఈ వేషాలు పనికిరావు. దెబ్బలాడాలని ఉందా? రా. నాక్కూడా సత్తువ ఉంది. నిన్నూ నీట్లోకి లాక్కుపోతాను."

"వద్దు ధన్యవాదాలు! ఒక్క ఉపకారం మీ నుండి కోరుతున్నాను. అంతే! మానవజాతిని మీరెంత ద్వేషిస్తున్నా నా వంటి దీనుడి కోరిక చెల్లించకపోరనే నా నమ్మకం, మీలాగే నేనూ వెలిపడ్డాను."

"నువ్వంటే ఆశ్చర్యం కలుగుతోంది. నేనేమీ వెలిపడడం లేదు. నేను స్వేచ్ఛా ప్రాణిని. జీవితమంటే నాకసహ్యం. కేవలం ఆర్థిక కారణాల వల్ల ఈ నిర్ణయానికి నేను రాలేదు."

"మరీ మంచిది. అందుచేత నేను కోరేదేమంటే..."

"లాభంలేదు, క్షమించాలి. నేనేమీ ఇయ్యలేను. నా తాలూకు వస్తువులన్నీ ఇంట్లోనే విడిచిపెట్టి వచ్చాను. శుల్కం తీసుకోకుండానే వైతరిణి దాటించాలి నన్ను షారన్."

"అదేం ఫర్వాలేదు. నేను కోరేదంతా మీ వేస్టుకోటు మాత్రం."

మరణానికి సిద్ధంగా ఉన్న ఆ సాహసిక వేదాంతికి కూడా ఒంటరిగా ఒక బిచ్చగాడి చేతులలో పడినందుకు కళవళపాటూ, భయమూ స్పష్టంగా చూపెట్టాయి. కాని అతడేమీ అనలేదు. ఊపిరి బిగపట్టి అతడు జాగ్రత్తగా మొదట తన పాత హేటు తీసి ట్రిస్టానో కిచ్చాడు. ట్రిస్టానో దానిని చంకన పెట్టాడు. తర్వాత జాకెట్ తీశాడు. ట్రిస్టానో దానివైపు సంతుష్టిగా చూచి, "దీని కిక్కడ కన్నం ఉన్నదండీ!" అన్నాడు.

"ఆత్మహత్య చేసుకుంటూ మంచి బట్టలు పాడు చెయ్యటమెందుకని ఆలోచించానులే.... కాని నీ దౌర్జన్యం ఏమీ బాగులేదు. సిగ్గు తెచ్చుకో."

"ఏం దౌర్జన్యం చేశాను? నేనేం కూనీ చేస్తాననుకున్నారా? మిమ్మల్ని భయపెట్టనైనా లేదే! ఇవన్నీ మీరు మనస్ఫూర్తిగానే ఇస్తున్నారనుకున్నాను."

"అయితే నువ్వు జేబుదొంగవు కావన్న మాట."

తన సంగతి అతడు సరిగా గ్రహించినందుకు ట్రిస్టానోకు ముచ్చట కలిగింది. కాని దొరికిన వస్తువులు వదలడానికతనికి మనస్కరించలేదు. కోటును ప్రేమగా పట్టుకొని చూస్తూ ట్రిస్టానో అన్నాడు విచారంతో.

"జేబుదొంగ అనకండి నన్ను. హృదయానికి గాయం చేస్తున్నారు. నేనో పెద్ద మనిషిని. చూడండి, ఈ కోటును. ఇది మీరు ధరించ దగ్గదిగా ఉందా?... ఎవరైనా ఏమంటారు? తప్పకుండా మీకు డబ్బు చిక్కులున్నాయంటారు.. అన్నట్టు దయచేసి మీ పంట్లాం జేబులు కూడా తిప్పుతారూ? సరి. ఏమీలేవు వాటిలో, మంచిది. థాంక్స్. మీరు చెప్పదలచింది అయిపోయింది కాబట్టి–"

"లేదు. అక్కడే పొరబడ్డావు. నా నిర్ణయానికి డబ్బు చిక్కులు చాలా చాలా అల్ప కారణం."

"అది తిరుగులేని నిర్ణయం. డబ్బంటే నాకసహ్యం... నేను ప్రొఫెసరుగా ఉన్నప్పుడు కుర్రాళ్ళు నామీద బంగాళాదుంపలు విసిరే వాళ్ళని నా ఉద్యోగం లాగేశారు. మంత్రి నాకు మ్యూజియంలో ఉద్యోగం ఇయ్యలేదు. అయితే ఈ చిన్న కారణాలకే వేదాంతి అన్నవాడు ప్రాణాలు తీసుకుంటాడా? లోకం కోసం వేదాంతులింకా బతకాలి. నువ్విది చెప్పవచ్చును. మానవకోటి కింకా వేదాంతుల అవసరం ఉన్నదని. కాని నీవంటి జేబుదొంగకు వేదాంతులు ఆత్మహత్య లెందుకు చేసుకుంటారో ఆ సూక్ష్మ కారణాలు అర్థం కావు."

"కాని నేను జేబుదొంగను కానని మనవి చేసుకున్నాను. నన్ను నమ్మరూ? సరే.

నా నమ్మకం ఇప్పుడే నిరూపిస్తాను. మీ పంట్లామూ, జోళ్ళూ విప్పి ఇవిగో నావి తొడుక్కోండి. ఇవి మంచి దుస్తులు. ఈ జోళ్ళు అమెరికా వస్తువులు. నా కోటు కూడా మీకు ఇచ్చి వేద్దును కాని అదంత అవసరమని తోచదు. అంటే – కోటుతో కూడా ఎవ్వరూ చచ్చిపోరు. ఈ కటకటాలమీద ఇలా వదిలేస్తారు."

వేదాంతి మానవజాతిని బాగా ఎరుగునుగాని చనిపోయే తనకు ఇటువంటి మర్యాద చూస్తే ఆశ్చర్యం కలిగింది. మంచి అంత్యక్రియలే జరుగుతున్నట్లు బోధపడింది. ట్రిస్టానో తన అభిప్రాయం స్పష్టంగా బోధపరుస్తున్నాడు.

"నేను దీన బాంధవుడినని మీరు సరిగానే గ్రహించారు. నిజంగా దీన బాంధవుడినే. కాని అందులో నాదొక ప్రత్యేకపు రకం. ఇతరుల అభిప్రాయాలను నేనెప్పుడూ గౌరవిస్తాను. పైగా ఆత్మహత్య అంటే నా కంగీకారం... ఏమో, ఇంక కొన్నాళ్ళలో నేను కూడా....! అందుచేత మీ నిర్ణయానికి నేను అడ్డుతగిలే వాణ్ణి కాను. మీ కోరికలకు భంగం కలుగని విధంగా నా సాయం నేను చేస్తున్నాను."

వేదాంతికి ఈ సబబులు నచ్చాయి. దీనికి ఫలితంగా వేదాంతీ, దీన బంధువుడూ బట్టలు మార్చుకున్నారు. (ఈ దుస్తుల మార్పు పరిస్థితుల మినహాయింపుతో కేవలం హోమరు కాలపు నాయకుల కవచాల మార్పులాగే ఉన్నది). ట్రిస్టానో ఇక తన మనస్సులో పీకుతున్న ఊహను పైకి కక్కబోయాడు.

"ఇక మీరు దర్జాగా చనిపోవచ్చును. చూడండి! డబ్బు చిక్కులచేత చచ్చిపోతున్నారని మిమ్మల్ని ఇప్పుడు ఎవ్వరూ అనలేరు."

"ఔను. నిజమే. ఆ సంగతి నాకే తట్టవలసింది. ఇప్పుడు తెలిసిందా ఇక నేనెందుకు పోవాలో?" అని నదివైపు చెయ్యి ఊపాడు. "లేకపోతే మర్యాద కాదు చూడూ!"

'సరిగా మార్టినెజ్ అభిప్రాయమూ అంతే' అనుకున్నాడు ట్రిస్టానో. కాని పైకేమీ అనలేదు.

".... నాది చాలా విషాద గాథ. విను. నేను అందరికీ కానివాడినైపోయాను. డైరెక్టరు తలుపు బిడాయించి తన సంస్థకు నేను తలవంపులు తెచ్చానని తగిలేశాడు. మంత్రివర్గం నాకు తాహతులు చాలవని తోసేశారు. ఏమీ తోచక నా కూతుర్ని చూడటానికి వెళ్ళాను. ఔను. మనకో కూతురు. నాకు నలభై దాటుతాయి కాని ఇరవై యేళ్ళ కూతురున్నది. అయితే ఆమె వివాహం వల్ల పుట్టింది కాదు. వేదాంతులకు సామాన్య సంఘ నిబంధనలలో నమ్మకం ఉండదు. అయినా ఆమె నా కూతురే. నా పనిలో నేను మునిగి ఉండి ఆమెను గూర్చి అట్టే తెలిసికోలేక పోయేవాడిని. నిజానికి రెండేళ్ళ నుండి ఆమెను చూడనేలేదు. అంచేత పోనీ చూద్దామని వెళ్ళాను... వెళ్తే దానికో మొగుడు!"

"ఏమిటి? అంత చిన్నతనంలోనే?"

"ఎవడనుకున్నావు వాడు? ఓ మాంసం అమ్ముకునే వెధవ. మామూలు కసాయి. నా కూతురు మా కుటుంబ గౌరవం నాశనం చేసింది. వీడున్నాడే ఈ కసాయి వెధవ, నన్నింట్లోకి రాకుండా వెళ్ళగొట్టాడు. వెధవ ఇల్లు! మాంసం కంపు! అప్పుడు నా కూతురు కూడా ఉంది కాని తండ్రిని కదా నా పక్షం ఒక్క మాటన్నా అనలేదు..."

ఈ తుది ముక్కలు మాత్రం వేదాంతి నిజమైన వేదనతో అన్నాడు. అతని కథ అంతటిలోకీ దీనిలోనే రుజుత్వం ధ్వనించింది. త్రిస్టానో హృదయాన్ని కూడా ఇది కదిల్చింది.

"అయ్యో, పాపం!"

"అందువల్ల చూశావా, మనకి ఆత్మహత్య చేసుకోవడానికి తగిన కారణాలున్నాయి. అందుచేతనే నేనీ సుప్రసిద్ధమైన నదిని ఎంచుకున్నాను. దీనిలోంచి నేను సముద్రానికి కొట్టుకు పోవచ్చును. అప్పుడు ప్రజలు నేను చచ్చిపోలేదనీ, కేవలం 'సముద్రపు మార్పు'తో ఇంకో ఉన్నత, అద్భుత జీవితం పొందాననీ తెలుసుకుంటారు."

త్రిస్టానో అతణ్ని ప్రశంసాదృష్టులతో చూశాడు. కాని తన భాగం పని ముగిసిందనీ, వేదాంతి చెయ్యవలసిన పని మిగిలిందనీ గ్రహించాడు. చనిపోయే వాడు చెప్పదలచిన దానికంటే ఎక్కువే చెప్పాడు వేదాంతి. ఇక వీడ్కోలు చెప్పితే బాగుండును. క్షణం ఆగి త్రిస్టానో –

"ఇక సెలవు తీసుకుంటున్నాను. బహుశా నేను కూడా ఒకరోజు మీ వెనకనే నీళ్ళలోకి వచ్చి నా కథ నివేదించుకుంటాను."

"సెలవు" అని వేదాంతి నదివైపు ఉపక్రమించాడు.

ఈ వేదాంతి నీళ్ళలో పడేదాకా అక్కడ ఆగాలో, లేక చావంటే తనకు సహజమైన భయంచేత చూడటం మానెయ్యాలో త్రిస్టానోకు నిశ్చయం కాలేదు. వెనక్కి ఒకటి రెండడుగులు వేసి వేదాంతిగారి అమూల్యమైన కోటును ఎగాదిగా చూశాడు. తర్వాత కళ్ళు మూసుకున్నాడు.

కాని వేదాంతి తిరిగి వచ్చి గంభీరంగా అన్నాడు.

"చూడూ! షర్టుతో ఎందుకు దిగాలో నాకు బోధపడలేదు. ఎలాగైనా చచ్చిన తర్వాత నేను మర్యాదగా కనపడాలికాదూ? నీ వేస్టుకోటూ, కోటూ కూడా ఇచ్చేస్తావా?"

త్రిస్టానో కొంచెం కళవళ పడ్డాడు. కాని అందరూ షర్టుతోనే నీళ్ళలో పడడం మామూలని వేదాంతికి నచ్చజెప్పి లాభం లేదని తోచింది. ఇంతలో తనకు మరో మంచి ఊహ తట్టింది. ఇతని శరీరం బైటికి తీసినప్పుడు (అంచనా లెక్కల ప్రకారం శరీరాలన్నీ దొరికితీరినట్లు తెలుస్తున్నది) వంటిమీదనే తన కోటూ, పత్రాలూ ఉంటే త్రిస్టానో మార్టినెజ్

చావు స్థిరపడుతుంది. కటకటాల మీద కోటు దొరకడం కంటె ఇదే మంచిది. అందువల్ల పూర్తిగా బట్టలు మార్చుకోవడానికి అతడు అంగీకరించాడు. మొగాలు కూడా మార్చుకోగలిగితే మరీ సంతోషించి ఉండును. వేదాంతి మొగానికి అంత చెప్పుకోదగ్గ అందం లేకపోయినా! కాని ఈ ఉపకారం నదీజలం చేసి పెట్టవచ్చునని ఆశించాడు. నీళ్ళలో వీడి శవం కుళ్ళిపోయి పాతి పెట్టడానికి వీలులేకుండా అవుతుంది. నది నిండుగా ప్రవహిస్తున్నది కాబట్టి ఆలస్యంగా శవం దొరికి బాగా కుళ్ళడానికి అవకాశం ఉంటుంది.

బట్టలు మారుస్తున్నప్పుడు ట్రిస్టానో కొంచెం జాగ్రత్తపడి తన కోటు జేబులో ఉన్న బంగారు నాణాలు తీసుకున్నాడు. కాదూమరి! డబ్బును కూడా వేదాంతితో బాటు నీళ్ళలో పారవెయ్యడం అవివేకమే. వేదాంతి మాత్రం నిశ్శబ్దంగా బట్టలు వేసుకుంటున్న వాడల్లా ఇటు తిరిగితే తన వెకిలి కళ్ళకి నాణాలు కనబడ్డాయి. వాటివైపు వెర్రిగా చూస్తూ అమాయకంగా అన్నాడు.

"దానిలో కొంత నాకియ్యవలసి ఉంటుంది. అప్పుడు తప్పకుండా ప్రజలు లేమివల్ల నే నిది చెయ్యలేదని గ్రహిస్తారు."

ట్రిస్టానోకు ఈ విషయమై కొంత చర్చించాలని తోచింది కాని అప్పుడే తెల్లవారిపోతున్నందున ఒప్పుకున్నాడు.

"తీసుకోండి. ఇవిగో రెండు నెపోలియన్లు."

"మీ యిష్టం... రెండో, మూడో..."

"సరే, మూడే తీసుకోండి."

వేదాంతి తీసుకుని వాటిని నిర్లక్ష్యంగా చూస్తూ అడిగాడు;

"ఏది మంచి జేబు? అంటే... మళ్ళీ ఇవి పడిపోతే మనం అనుకున్నదంతా పాడైపోతుంది."

"ఎడమప్రక్కకు లోపలిజేబు ఉంది. బొత్తాయి కూడా పడుతుంది దానికి."

"థాంక్స్! ఇక కోటు తొడుక్కుంటాను. ఈ బట్టలు వేస్తే బాగున్నాను కానూ? - ఏదీ ఆ హేటు కూడా!"

"అయ్యో, ఇదివ్వడమెందుకండీ? ఇదేం ఉపయోగం మీకు?"

"ఔనౌను. నిజమే.... ఇక మీరు కొంచెం దూరంగా నిలబడుతారూ? మళ్ళీ ఆఖరుకు నన్ను లాగేస్తారేమో!"

"లేదు. ఖరారు చేస్తున్నా."

"అయితే సెలవు."

"సెలవు."

ట్రిస్టానో కటకటాలు దాటిపోయి వీథి ని గడచి అవతలదారిమీద ఆగాడు. ఇంకా

అయిపోయి ఉందనుకొని ఏదో చిన్న అనుమానం– నిరాధారమైన అనుకోవచ్చు– వెనక్కి నిలిపింది. అబ్బే! వీడు పిచ్చివాడనే కడదాం. కాని మాట నిలబెట్టుకోవలసినవాడే. కాబట్టి ట్రిస్టానో మళ్ళీ కళ్ళుమూసుకుని నీళ్ళలోని చప్పుడుకోసం, వేదాంతి తన అప్పులన్నీ తీర్చడం కోసం వేచుకున్నాడు.

అప్పటి తన మనఃస్థితినీ, ఆ రాత్రి చలిగాలినిబట్టి చూస్తే చాలాసేపు వేచి ఉన్నట్లు అనిపించడం సహజమే. కాని నిజంగా అవి కొన్ని క్షణాలు మాత్రమే. ఈ అల్పక్షణాలలోనే ఏదో భయంకరమైన ఊహలు పుడుతున్నాయి. ఏదీ, ఇంకొక్క క్షణం... పోనీ మరొక్కటి. ఇంకొక్కటి మాత్రం, వెనకటి అన్నిటికంటే భయంకరమైనది... ఇక వీలులేదు. దుర్భరం, మరణవేదనను మించిపోతున్నది. ఈ నిరీక్షాయాతన! వాడు నీళ్ళలోకి గెంతడం కనబడితే కనబడనీ, భయమైనా కళ్ళు విప్పి తీరాలి.

అప్పుడే కళ్ళు విప్పేశాడా? అక్కడ ఎవ్వరూ లేరు. అయినా తనకేమీ వినిపించడం లేదేం. నీటిహోరువల్ల పడిపోయిన చప్పుడు వినిపించడం లేదేమో. ఇక్కడికే ఆ దూరం నుండి సన్నని హోరు వినబడుతోంది. మీదకు వెళ్ళి చూస్తే? కాని వెళ్ళడానికి ముందు అతడు ఎదురుగుండా వీథివైపు చూశాడు. ఇరవై గజాల ముందు గోడప్రక్క నీడలో ఒక నల్లటి రూపం ప్రాకిపోతున్నట్లు కనిపించింది. ఆ రూపంలో చాలాభాగం వేదాంతినీ, కొంతభాగం తన్నూ ట్రిస్టానో పోల్చుకున్నాడు.

“ఏయ్! ఎక్కడకు పోతున్నావు?” అని అరిచాడు.

వేదాంతి చకితుడైనాడు. నేరం చేసిన పిల్లిలాగు వెంటనే కాలికందినట్టు దౌడుతీశాడు. ట్రిస్టానో గభీమని అతణ్ణి వెంటబెట్టాడు. కాని వేదాంతి జేబులో మూడు నెపోలియన్లు పడగానే అతగాడి కాళ్ళకు రెక్కలు వచ్చినట్లయింది. వీథిమలుపు తిరిగిపోయి అతడు మాయమైనాడు.

ఇక లాభంలేదని ట్రిస్టానో పరుగు తగ్గించాడు. మలుపు తిరగకుండానే ఆగిపోయి జరిగిందేదో జరిగిందని నిస్పృహ చేసుకున్నాడు. తాను ధరించిన పాతకోటులో వాడి చిరునామా దొరికితే మాత్రం ఏపాటి ఉపయోగం అవుతుందో అతనికి తెలియలేదు.

చివరికి ట్రిస్టానో ఇంటికివెళ్ళి దుస్తులు మార్చుకునే లోపుగా చిరిగిపోయిన పాతకోటూ, అనుమానాస్పదమైన ముఖలక్షణాలూ చూసి అతణ్ని ఒక తిరుగుబోతుగా కట్టి ఎరస్టు చేశారు.

(రచయిత : Giulio Caprin)

***ప్రథమ ముద్రణ : ఆంధ్రపత్రిక, ఏప్రిల్ 27, 1938***